సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతంలోకి...
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 18 ఏప్రిల్ 2025
పేజీలు 8

## ఉచితంగా వైద్య సేవలు పొందండి



### సాధారణ డెలివరీలతో మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నాం

**డాక్టర్ బాలాజీ**

పమిడిముక్కల, ఏప్రిల్ 17, మేజర్ న్యూస్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ డెలివరీ చేయడం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నామని మండల పరిధిలోని కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరుగు 2లో



## చిట్టచివరి గింజ వరకు
# కొనుగోలు

- దాల్వా కాలంలో 24 గంటల్లో రూ.590 కోట్లు చెల్లింపు
- రైతులకు అండగా ఉంటాం.. : రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత దాల్వా కాలంలో 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 590 కోట్ల రూపాయలను 24 గంటల్లోనే రైతులకు చెల్లించిందని, ఈ కాలంలో చిట్టచివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మంత్రి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలాని సమూన్, కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి కంకిపాడు మండలంలోని పునాదిపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, ధాన్యం ఆరబెట్టు కేంద్రం, బాలాజీ మిల్లు, పెనమలూరు మండలం వణుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తొలుత మంత్రి పునాదిపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మిల్లుల దగ్గర గాని, తేమ విషయములో గాని ఏమైనా సమస్యలు ఉన్నాయా అని 2



### స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు
# సరికొత్త ఊపు

- రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్‌తో మారనున్న పారిశ్రామిక రంగ రూపురేఖలు
- విజయవాడలో స్పోక్ ప్రాంతీయ కేంద్రం అభివృద్ధికి ముమ్మర కసరత్తు
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 17, మేజర్ న్యూస్ :** స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో సరికొత్త ఊపు రానుందని.. ఈ హబ్‌తో పారిశ్రామిక రంగం రూపురేఖలు సమూలంగా మారనున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో టాటా ఇన్నొవేషన్ హబ్ - స్పోక్‌పై సమావేశం నిర్వహించగా రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, మిగతా 2లో...

## వేసవిలో తాగునీటికి పకడ్బందీ చర్యలు

## రూ.800 కోట్లతో....
# జిల్లాలో విద్యుత్ కేంద్రాలు

- ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్తును సరఫరా చేస్తాం
- రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ బాలశౌరి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లాలో 800 కోట్ల రూపాయల వ్యయంతో పలు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్తును సరఫరా చేస్తామని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ బాలశౌరి అన్నారు. గురువారం ఉదయం మంత్రి గొట్టిపాటి రవికుమార్, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్‌లతో కలిసి పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరులో టిడ్కో గృహ సముదాయం వద్ద 4.36 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ అవుట్డోర్ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉయ్యూరులోని టిడ్కో గృహాలు, శ్రీనివాస్ నగర్, మిగతా 7లో

(మొదటిపేజీ తరువాయి)

## ఉచితంగా వైద్య సేవలు పొందండి

బాలాజీ పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ డెలివరీ అనంతరం ఆ బాలింతకు ఎన్టీఆర్ బేబి కిట్టును ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి శస్త్ర చికిత్స లేకుండా తేలికగా ప్రసూతి అయ్యేందుకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని, వీటిని నిర్వహించడం తమకెంతో ఆనందదాయకంగా ఉందని పేర్కొన్నారు. ఈ విధంగా సాధారణ డెలివరీ చేయడం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పేదలకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచిత ఆరోగ్య సేవలు అందించడంతోపాటు మందులు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకుని వైద్య సేవలను ఉచితంగా పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే 104 వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉచితంగా వైద్య సేవలను తమ సిబ్బంది అందిస్తున్నారని, వాటిని కూడా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందాలని డాక్టర్ బాలాజీ విజ్ఞప్తి చేశారు. ప్రసూతి కోసం ప్రత్యేకంగా తమ ఆరోగ్య కేంద్రానికి గర్భిణీ మహిళను తీసుకువచ్చిన ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

## స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు సరికొత్త ఊపు

కమ్యూనికేషన్స్ (ఐటీఈ అండ్ సీ) ప్రత్యేక అధికారి దీప్తి రావులతో పాటు సమన్వయ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్టార్టప్, ఆవిష్కరణల వ్యవస్థలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ విధానాలను అమలుచేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం అమరావతిలో రతన్ టాట్ ఇన్నొవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా ఈ హబ్‌కు అనుసంధానంగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపూర్‌లో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మద్దతు, ప్రైవేటు నిర్వహణలో ఉండే ప్రధాన హబ్‌తో పాటు ప్రాంతీయ కేంద్రాలకు ప్రత్యేక బోర్డులు ఉంటాయని, ప్రాంతీయ కేంద్రానికి ఒక ప్రమోటర్ ప్రెసిడెంట్‌గా, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది సహ ప్రమోటర్లు, ఇద్దరు స్వతంత్ర్య నిపుణులతో పాటు ప్రభుత్వం, విద్యారంగం, పారిశ్రామిక అసోసియేషన్ల నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఇందుకు ఏపీ ఇన్నొవేషన్ సొసైటీ దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. పెట్టుబడులు, ఫైనాన్సింగ్, ఇంక్యుబేషన్, భాగస్వాముల నిర్వహణ, అకౌంటింగ్, మార్కెటింగ్, కమ్యూనికేషన్ వంటి విధులను బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ నిర్వహిస్తుందని వివరించారు. విజయవాడ ప్రాంతీయ స్పోక్ కేంద్రం కార్యకలాపాల నిర్వహణకు శాశ్వత ప్రాంగణం అందుబాటులోకి వచ్చేంతవరకు తాత్కాలిక భవనంతో పాటు మౌలిక వసతులు కల్పించడం, కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలా చూడటంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయి ఇన్నొవేషన్ టాస్క్ ఫోర్స్ పనిచేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్య సాధనకు, స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనికతను సాకారం చేయడంలో విద్యా సంస్థలు, పారిశ్రామిక సంఘాలు తదితరాలు భాగస్వాములవుతాయని సమావేశానికి హాజరైన ప్రతినిధులు స్పష్టం చేశారు. సమావేశంలో విట్-ఏపీ ప్రతినిధి డా. అమీత్ చరణ్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధి ఉదయన్ బక్షి, మోహన్ స్పింటెక్స్ ప్రతినిధి వి.రమేష్, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, నగరపాలక అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని చంద్రబాబు రుజువు చేశారు



**నందిగామ, ఏప్రిల్ 17, మేజర్ న్యూస్ :** ఎస్సి వర్గీకరణపై నియోజకవర్గ ఎస్సి సెల్ తెదేపా నేతలు గురువారం నందిగామ పట్టణం కాకాని నగర్ ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో పత్రిక సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆమోదం తెలపడంతో రాష్ట్రంలో అమలు చేయాలని సీఎం చంద్ర బాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.రాష్ట్రంలోని ఎస్సీల స్థితిగతుల అధ్యాయనానికి 2024 నవంబర్ 15న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన ఏకసభ్య కమిషన్ ను కూటమి ప్రభుత్వం నియమించింది. కమిషన్ రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పర్యటించి ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. సిద్ధం చేసిన నివేదికను 2025 మార్చి 10న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు అందించారు.ఎస్సీ ఉపకు లాల్లో సమన్యాయం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వర్గీకరణ చేశామని తెలియజేసారు. కార్యక్రమమంలో నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్య క్షుడు మార్కాపుడి వరకుమార్, తెదేపా ఎస్సి సెల్ నేతలు నూకయ్య, నాతనే యులు, వేల్పుల బిక్షాలు,జామా ఆనంద్, గౌతమ్ ప్రసాద్, కోట రాజు, కిషోర్, రాజీవ్ గాంధీ,ప్రసాద్, చందు,జాన్ కోటయ్య పాల్గొన్నారు.

# చిట్టచివరి గింజ వరకు కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుమ్మిల వెంకటేశ్వరరావుకు చెందిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమకు ధాన్యం కొనుగోలు పైకం 24 గంటల్లో తమ బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. ధాన్యం ఉత్పత్తి పెరిగినందున గోతం సంచుల కొరత ఉందని, తగినన్ని సరఫరా చేయాలని, వర్షం వచ్చినప్పుడు దాన్యం కప్పుకోవడానికి టార్పాలిన్ పట్టలు సరఫరా చేయాలని, రవాణా కిరాయి డబ్బులు రావాలని రైతులు మంత్రికి విన్నవించారు. దీంతో మంత్రి వెంటనే స్పందిస్తూ అవసరమైనన్ని గోతం సంచులు రైతులకు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల సంస్థ అధికారులు, సంయుక్త కలెక్టర్‌కు సూచించారు.అనంతరం పునాదిపాడు లోని ధాన్యం ఆరబెట్టు కేంద్రాన్ని మంత్రి సందర్శించి అక్కడ రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతు తూముల శ్రీనివాసరావుకు చెందిన మూటల్లో ఉన్న ధాన్యాన్ని, ట్రాక్టర్ నుండి దించుతున్న ధాన్యాన్ని మంత్రి స్వయంగా చేతిలోకి తీసుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన 600 గోతం సంచులలో 100 సంచులు దెబ్బతిని ఉపయోగపడటం లేదన్నారు. సరైన గోతాలు ఇవ్వాలని, ధాన్యం ఆరబెట్టుటకు ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి వెంటనే స్పందిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో సంప్రదించి ప్రతి పంచాయతీలోనూ ధాన్యం ఆరబెట్టుటకు ప్లాట్ఫారం ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. గోతం సంచులు బాగా గమనించి మంచి గోతం సంచులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి లారీలోకి ఎక్కించిన దాన్యం మూటలను మంత్రి పరిశీలించారు. ఒక చెక్లిస్ట్ పెట్టుకొని ఎస్ఓపి ప్రకారం అన్ని సజావుగా ఉన్నాయా లేదా గమనించుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. తదుపరి కంకిపాడు మండలంలో జాతీయ రహదారి పక్కన గల బాలాజీ మిల్లును పరిశీలించారు. అక్కడ మిల్లు యజమాని వెంకటరావుతో మాట్లాడుతూ రైతులు నుంచి పలు ఫిర్యాదులు మిల్లు పైన వస్తున్నాయని, మూడు రోజుల్లో సావధానంగా రైతులతో మాట్లాడి సరిచేసుకోవాలని, లేనిపక్షంలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇతర జిల్లాలకు పంపిస్తామని హెచ్చరించారు. తదుపరి మంత్రి పెనమలూరు మండలం వణుకూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అక్కడ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా కల్పించారు.తదనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్ సీజన్లో ప్రజలందరి సహకారంతో ధాన్యం కొనుగోలును రైతులకు అండగా నిలబడే విధంగా కొత్త ఆలోచన విధానాలతోటి ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని అద్భుతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగామన్నారు. గతంలో చాలామంది రైతులు ధాన్యం కొనుగోలులో చాలా నష్టపోయారని ఆ విధంగా జరగకుండా రైతులకు దాన్యం అమ్మిన 24 గంటల్లోనే అందుకు సంబంధించిన పైకాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. సుమారు 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 8600 కోట్ల రూపాయలను సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. రైతులకు దళారులతో గాని, మిల్లర్లతో గాని



ఎలాంటి సంబంధం లేకుండా ఇబ్బంది లేకుండా ధాన్యం వారికి నచ్చిన చోట అవసరం కల్పించిన మద్దతు ధరకు తక్కువ కాకుండా అమ్ముకునే వెసులుబాటు కల్పించామన్నారు. గతంలో ఖరీఫ్ సీజన్లో వర్షాలు వచ్చినప్పుడు ఇదే గ్రామానికి ఒకసారి వచ్చానని, ప్రస్తుతం రబి సీజన్లో ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతుందో పరిశీలించేందుకు మరలా వచ్చానన్నారు. దాల్వా రెండో పంట చాలా అద్భుతంగా కొనుగోలు జరుగుతుందన్నారు. దాదాపు 2 లక్షల 40 వేల ధాన్యం కొనుగోలు చేసి 590 కోట్ల రూపాయలను సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు, ధాన్యం సేకరణ స్థితిగతులు తెలుసుకుంటున్నామన్నారు. ఈసారి ధాన్యం ఉత్పత్తి బాగా పెరిగిందని దీంతో కొంత గోతం సంచుల కొరత ఏర్పడిందన్నారు. గతంలో వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 35 గోతం సంచులు ఇవ్వడం జరుగుతోందని అయితే ఈసారి దిగుబడి పెరగడంతో 60 నుంచి 65 బస్తాల దాన్యం వచ్చిందన్నారు. దీంతో రైతుల అవసరాలను బట్టి 70 గోతం సంచుల సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లుల దగ్గర 4 గంటల కంటే ఎక్కువ కాలం వాహనం ఉంటే జిపిఎస్ ద్వారా సమాచారం తమకు వచ్చి చేరుతుందని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఒక భరోసా కల్పించే విధంగా ఇలాంటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. చాలామంది రైతులు వచ్చి ఇలా దాల్వా కాలంలో దాన్యం కొనుగోలు చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలుపుతు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారన్నారు. రాష్ట్రంలో ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం హామీ ఇస్తుందన్నారు.ఎన్ని వేల మెట్రిక్ టన్నులైనా సరే ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.కృష్ణాజిల్లాలో సరిపోకపోతే ఇతర జిల్లాల మిల్లులకు తరలించైనా ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉండి వారికి మేలు చేస్తుందని చెప్పారు.వర్షాలకు దెబ్బతినే మొక్కజొన్న గాని జొన్న గాని మినుముగాని ఏ పంటకైన కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం రైతులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

ఈ పర్యటనలో మంత్రి వెంట ఉయ్యూరు ఆర్డిఓ హేలా షారోన్, డిఎస్ఓ పి పార్వతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్, మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానందం, ఆర్టీవో శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటికి పకడ్బందీ చర్యలు

**వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ఏర్పాట్లు**

**ఈ-వ్యర్థాల నిర్వహణ ఇతివృత్తంతో ఈ నెల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 17, మేజర్ న్యూస్ :** జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ లక్ష్మీశ వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకున్న చర్యలు, వచ్చే వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలు, ఎంఎస్ఎంఈ సర్వే, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, పీఎం సూర్యఘర్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై తదితరాలపై సీఎస్ మార్గనిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా వేసవిలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజావసరాలు, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఉన్న ఇసుక స్టాక్ యార్డ్‌లలో దాదాపు 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను సిద్ధం చేసి, ఇసుక కొరతకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన భూమిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని.. ఈ నెల మూడో శనివారం ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ ప్రధాన అంశంతో కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పర్యావరణ హిత ఈ-వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జి, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

# లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై అపోహలు విడనాడాలి



**విజయవాడ మేజర్ న్యూస్ :** లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ పై అపోహలు విడనాడాలని, లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీఅనేది లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్ళల్లోని కార్నియా వొంపును సరిదిద్దడం ద్వారా రోగికి కళ్ళద్దాల అవసరం లేకుండా సహాయపడే ఓ ప్రక్రియ అని ఎల్విపిఈఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రేరణా శెట్టి తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోడె వెంకటాద్రి క్యాంపస్ లో లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఈ శస్త్రచికిత్సను సాధారణంగా మైయోపియా (హ్రస్వ దృష్టి), హైపర్‌మెట్రోపియా (దూర దృష్టి లోపం), ఆస్టిగ్మాటిజం (వక్రదృష్టి)లను సరిచేయడానికి చేయబడుతుందన్నారు. రోగి వయస్సు కనీసం 21 సంవత్సరాలు అయివుండాలని, కనీసం ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టిని కలిగివుండాలని,అపవర్తన దోషం అతి తక్కువగానూ, మితంగానూ ఉండాలని,రోగి కళ్ళు మంచి మందంగల కార్నియాలను కలిగివుండాలని,నీటికాసులు, కెరాటోకోనస్ లేదా కంటిశుక్లంలాంటి ఇతర కంటి వ్యాధులు ఉండకూడదన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ ద్వారా 20/25 లేదా అంతకంటే మెరుగైన (కళ్ళద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయగ లిగేంత స్పష్టంగా చూడగలిగే) దృష్టిని పొందడం, అద్దాల పై ఆధారపడటాన్ని తగ్గించడం, చూపును త్వరిత గతిలో తిరిగి పొందడం, ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలు అనేక రకాలుగా ఉన్నాయని, కంటి నిర్దిష్ట అవసరాల ఆధారంగా నేత్ర వైద్యులు సూచిస్తారన్నారు.లేసిక్ (లేజర్ – అసిస్టెడ్ ఇన్ సిటు కెరాటోమిలేసిస్),పిఆర్‌కె (ఫోటో రిఫ్రాక్టివ్ కెరాటెక్టమీ),స్మైల్ (స్మాల్ ఇన్సిషన్ లెంటిక్యుల్ ఎక్స్‌ట్రాక్షన్),విధానాలు ఉంటాయన్నారు.రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది ఎటువంటి నొప్పి ఉండదన్నారు.ఈ సర్జరీ ప్రక్రియ లోలక్షలాది మంది సంతృప్త రోగులతో, లేసిక్ 30 సంవత్సరాలకు పైగా నిర్వహించబడుతోందన్నారు. ఈ చికిత్స ద్వారా దీర్ఘకాలిక ఫలితాలు చాలా ఉన్నాయన్నారు.ఈ చికిత్స జరిగిన తర్వాత ఇకపై ఎప్పటికీ కళ్ళద్దాలు ధరించాల్సిన అవసరం ఉండదు అని చెప్పారు.లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది అందరికీ ఒకే విధంగా పనికొచ్చే పరిష్కారం కాదని, సరైన ప్రక్రియను నిర్ణయించడానికి అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులను సంప్రదించడం అవసరమని అని తెలిపారు.

## ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయించడం పట్ల హర్షం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించడం పట్ల వైసిపి యువనేత గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో వర్షం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవిని కొల్లూరు వెంకటేశ్వరరావుకు కేటాయించి షెడ్యూల్ కులాల వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గతంలో వలె కూటమి ప్రభుత్వంలో కూడా ఏఎంసి చైర్మన్ పదవిని షెడ్యూల్ కులాల వారికి కేటాయించి వారికి సముచిత స్థానం కల్పించాలని గతంలోనే సోషల్ మీడియా, పత్రిక ముఖముగా డిమాండ్ చేసినందున ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు.

## పోషణ్ పక్వాడపై గర్భిణీలకు అవగాహన



**పమిడిముక్కల ఏప్రిల్ 17 మేజర్ న్యూస్ :** తమ్ముడు ముక్కల మండల పరిధిలోని ముళ్ళపూడి గ్రామంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం పై గర్భిణీ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మన్నెం ఝాన్సీ ఈ కార్యక్రమంలో పాల్గొని గర్భిణీలకు పలు సూచనలు, సలహాలను అందించారు. పోషణ్ ట్రాకర్‌లో నమోదు ఏవిధంగా చేసుకోవాలనే విషయంపై వారికి వివరించడంతోపాటు 1000 రోజుల ప్రణాళికల ద్వారా జరిగే మేలు గూర్చి వారికి వివరించారు. పోషణ్ ట్రాకర్ లో నమోదు పై అవగాహన కల్పించడంతోపాటు కొంతమందితో స్వయంగా ఆమె తమ పేర్లను నమోదు చేయించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి, ఐనంపూడి, వేల్పూరు గ్రామాల్లోని అంగన్ వాడి కేంద్రాల కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, పలువురు తల్లులు పాల్గొన్నారు.

## రైతుల సమక్షంలో నవధాన్యాల తయారీ



**పెదపారుపూడి ఏప్రిల్ 17 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదురుగా నవధాన్యాలు (పి.ఎం.డి.ఎస్) 32 రకాలు విత్తనాలు స్థానిక రైతులు సమక్షంలో తయారుచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్ధసారథి మాట్లాడుతూ నవధాన్యాలు పొలంలో వేయడం వలన భూమి కి భూసారం పెరిగి మొక్కకు కావలసిన పోషకాలు అందించేలా ఉపయోగపడుతుందన్నారు. భూసారం పెరగడం వల్ల కలుపు తగ్గటంతో పాటు నీటి ఎద్దడి నుండి ప్రధాన పంటలను సంరక్షించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ కె.నాగమల్లేశ్వరి, ఎన్ ఎఫ్ ఏ గంగరాజు, కృష్ణార్జున, డివిజన్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, క్షేత్ర స్థాయి సిబ్బంది, పలు రైతులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఉపకులపతి ఆచార్య కె రాంజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎన్ టి ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ గిరీశాను మర్యాద పూర్వకంగా కలిసిన కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె రాంజీ, ఈ సందర్భముగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలుతో పాటు విజయవాడలో పిజి సెంటర్ ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు.

## విద్యుత్ మోటార్ల వైర్లను చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్



**తోట్లవల్లూరు ఏప్రిల్ 17 మేజర్ న్యూస్:** తోట్లవల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ల వైర్లను చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొద్దిరోజులుగా మండల పరిధిలోని వల్లూరు పాలెం, కళ్ళంవారి పాలెం, పాములలంక, పెనమకూరు తదితర గ్రామాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ ల ఎలక్ట్రికల్ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిపూట చోరీ చేస్తున్నారని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై కేసు నమోదు చేసిన ఎస్ఐ సిహెచ్.అవినాష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ గ్రామాల్లో సుమారు 190 విద్యుత్ మోటార్ల వద్ద 950 మీటర్ల వైరు చోరీకి గురైనట్లు రైతులు పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నేపథ్యంలో బొద్దపాడు-చిన్నపులిపాక మార్గంలో కల్వర్టు వద్ద అనుమానితుల గురించి సమాచారం అందుకుని సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్ళగా ముగ్గురు వ్యక్తులు ఒక బండి పై మూటను పెట్టుకుని పోలీసులను చూసి పారిపోవుటకు ప్రయత్నించగా పోలీసులు ఆ ముగ్గురు వ్యక్తులను పట్టుకుని విచారించారు. వీరిలో గన్నవరం మండలం బుద్ధవరం దాసర్ల పాక గ్రామానికి చెందిన చలందార్ల స్వామి(29), ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన చలమచర్ల మహేశ్వరరావు అలియాస్ మహేష్ (24), అదే గ్రామానికి చెందిన వబ్బాని డేవిడ్ (17) ఉన్నారు. వీరిని విచారించగా దురలవాట్లకు బానిసై డబ్బులు సంపాదించేందుకు రాత్రి సమయాల్లో పొలాల వద్ద మోటార్ల వైర్లను చోరీ చేస్తున్నట్లు తెలిపారు. చోరీ చేసిన వైర్లకు ఉన్న ప్లాస్టిక్ తొడుగులు పోయేందుకు మంటల్లో కాల్చి లోపలి తీగలను అమ్మేందుకు తీసుకు వెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి తొమ్మిది కిలోల రాగి వైరు, వారు నేరం చేసేందుకు ఉపయోగించిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

## ఏఎంసీ చైర్మన్ పోనకళ్ల నవ్యశ్రీని అభినందనలు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ చైర్మన్ గా మైలవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య సతీమణి పోనకళ్ల నవ్యశ్రీనూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పోనకళ్ల నవ్యశ్రీ, ఆమె భర్త బ్రహ్మయ్య, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదుని కొండపల్లిలోని తెలుగుదేశం పార్టీకార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మైలవరం ఏఎంసి చైర్మన్ పోనకళ్ల నవ్యశ్రీ, బ్రహ్మయ్య ని ఘనంగా సత్కరించి స్థానిక శాసనసభ్యులు కృష్ణప్రసాదు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతాంగానికి పారదర్శకమైన సేవలు అందించాలని వారికి సూచించారు. ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులు నాగేశ్వరరావుకి మాతృవియోగం

ఘనంగా నివాళులర్పించిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని కుంటముక్కల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు లంక నాగేశ్వరరావు (నాని) కి మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి లంక వెంకటరావమ్మ ఇటీవల తుదిశ్వాస విడిచారు. కుంటముక్కల గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆమె సంస్మరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గౌరవ మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు వెంకటరావమ్మ చిత్రపటానికి పుష్పములు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరు....



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని అటువంటి పార్టీలో తప్పులు చేసేవారిని క్షమించే ప్రసక్తి లేదని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి(చంటి) పేర్కొన్నారు. ఇటీవల పెదపారుపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పునుకొల్లు వీర వెంకట నాగ బెనర్జీ పై దాడి జరిగిన సంఘటనకు సంబంధించి మండల పరిధిలోని వెంకటప్రగడ గ్రామంలో మండల పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వారిపై వేటు తప్పదని హెచ్చరించారు. అక్రమ మట్టితోలకం విషయంపై ఫిర్యాదు చేశారనే కారణంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బెనర్జీపై దాడి చేసిన గ్రామ సర్పంచ్ భర్త చప్పిడి కిషోర్, చప్పిడి మాణిక్యాలరావులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ జిల్లా, రాష్ట్ర కమిటీలకు తీర్మానాన్ని పంపుతున్నట్లు రమేష్ చౌదరి వెల్లడించారు. కార్యకర్తలే పునాదిగా ఉన్న తమ పార్టీలో ఎటువంటి వివాదాలకు తావు లేదని, అటువంటిది సీనియర్ కార్యకర్తపై దాడి చేయడం క్షమించరాని నేరమని ఆయన పేర్కొన్నారు. తమ పార్టీలో ఎవరు క్రమశిక్షణ ఉల్లంఘించినా వారిపై వేటు తప్పదని, ఇందుకు ఇటీవల పార్టీలో జరిగిన పరిణామాలు ఉదాహరణని ఆయన పేర్కొన్నారు. వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని తీర్మానించామని ఆయన తెలిపారు. ఈ విషయంపై స్థానిక శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా కూడా స్పందించి పార్టీ నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే మండల పార్టీ సమావేశం ఏర్పాటు చేసి వారిపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించామని రమేష్ చౌదరి ప్రకటించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పార్టీ నాయకులు కూచిపూడి సుబ్బయ్య, గొరిపర్తి రవికుమార్, రాచూరి ప్రభుదాస్, కలపాల కిషోర్ కుమార్, రాచూరి బసవయ్య, దాసు రమేష్ నాగదేసి సునీత పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు జగన్‌కు ప్రతి పక్ష హోదా కూడా ఇవ్వలేదు



## ఎంపీ నిధులతో నిర్మించే రోడ్ల పనులను సైతం వైసీపీ అడ్డుకుంది

## 5వ డివిజన్‌లో రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి 11 అసెంబ్లీ సీట్లతో ప్రజలు సరిపెట్టి అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ హోదాను కూడా ఇవ్వలేదని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. కూటమి పార్టీలకు పూర్తి మద్దతు తెలిపి భారీ మెజార్టీని ప్రజలు అందించారన్నారు. ఈ డివిజన్‌లో గతం లో రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర తన ఎంపీ నిధుల నుంచి రెండు రోడ్ల నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు చేశారని, టీడీపీకి చెందిన వారు ఈ ప్రాంతంలో ఉన్నారనే కార ణంతో ఈ రోడ్ల నిర్మాణ పనులు చేయనీయకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. ఇలాంటి నీచమైన పనులు చేయబట్టే వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. గురువారం ఉదయం తూర్పు నియో జకవర్గ పరిధిలోని 5వ డివిజన్ ఎల్ఐసీ కాలనీ రోడ్డు నెంబరు 3,4 ఏరియా లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెల్సుకున్నారు. సుమారు రూ.29 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రహదారుల పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలం లో నియోజకవర్గంలోని చాలా రహదారులకు శంకుస్థాపనలు చేశామని వాటిలో చాలా పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఈ డివిజన్‌లోని రెండు రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వంలో రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర తన ఎంపీ నిధులను కేటాయించారన్నారు. ఎంపీ నిధులతో చేపట్టిన పనులు చేయడానికి కాంట్రాక్టర్లు కూడా త్వరగా ముందుకు వస్తారని చెప్పారు. టీడీ పీకి చెందిన వారు ఎక్కువుగా ఈ ప్రాంతంలో ఉన్నారనే ఒకే ఒక్క కారణంతో ఈ పనులు చేయనీయకుండా రాక్షస మనస్థత్వంతో వైఎస్సార్‌సీపీకి చెందిన వారు అడ్డుకున్నారని చెప్పారు. రాష్ట్రం మొత్తం అదే విధంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగిందన్నారు. అందువల్లనే ప్రజలు కూడా ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 ఎమ్మెల్యే సీట్లతో సరిపెట్టారని అన్నారు. కాని తనకు ప్రతిపక్ష హోదా కావాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టుపడుతున్నారని, చట్టం గురించి తెలుసుకునే ప్రయత్నం కూడా ఆయన చేయడం లేదన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు ఉన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, పవన్ కల్యాణ్‌లు సమానంగా నిధులను కేటాయించారన్నారు. విజయవాడ నగరానికి ప్రత్యే కంగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసుకుని రావాలని, అందుకు ఎన్ని కోట్ల రూపా యలు అయినా కేటాయించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నియోజకవర్గం నుంచి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిధులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంజూరు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్ కుమార్ మాట్లాడుతూ 5వ డివిజన్‌లోని 3,4 రహదారుల నిర్మాణం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నిత్యం ప్రజలకు అండగా ఉంటూ వారికి మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పార్టీ పరంగా కూడా నాయకులు,కార్యకర్తలకు ఎప్పటికప్పుడు దిశానిర్ధేశం చేస్తున్నారని చెప్పారు. తాను ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో ఎమ్మెల్యేను అయ్యానని, అధికారం ఉందనే ఆలోచనలను ఎప్పుడూ రానియ్యకుండా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారికి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి రాజేష్, డాక్టర్ గద్దె రామ్మోహన్, జి హరి బాబు, ఎస్ఎస్.శాస్త్రి, వేమూరి బాబూరావు, ధ్రువం నారాయణ, సాయిబాబు, రెడ్డి, కోడూరు సుబ్రమణ్యం, దోమకొండ రవి, షరీఫ్, కెనడి, అప్పారావు, ఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్ నెహ్రూ 8 వర్ధంతి







**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** ప్రియతమ నేత మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్ నెహ్రూ 8 వర్ధంతి సందర్భంగా 15 డివిజన్ రామలింగేశ్వర నగర్ పడవల రేవు సెంటర్ రజిత భార్గవి స్ట్రీట్‌లో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ళ చల్లారావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆధ్వర్యంలో దేవినేని రాజశేఖర్ నెహ్రూ చిత్రప టానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు తూర్పు నియోజకవర్గం ఇన్చార్జ్ దేవినేని అవినాష్, రాష్ట్ర సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు పాల్గొని నివాళులు అర్పించడం జరుగుతుంది. అనంతరం 300 మందికి చీరలో ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివి సత్యనారాయణ, బాలాజీ, రెహమాన్, రవి, విశ్వనాథ్, వేట నాని, నాయుడు, శ్రీను, రెడ్డి, దుర్గారావు, వెంకట్, సీతా రామయ్య, సూరి, చిన్న, రాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

## నలంద డిగ్రీ కళాశాల సక్సెస్ మీట్‌లో కృష్ణా వర్శిటీ ఉపకులపతి

**విజయవాడ మేజర్ న్యూస్ :** విద్యార్థులు ఉద్యో గాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కృష్ణా విశ్వవిద్యా లయం ఉపకులపతి ప్రొఫెసర్ రామ్‌జీ కునా అన్నారు. నలంద డిగ్రీ కళాశాల నందు 2024-2025లో అత్యధిక ప్లేస్‌మెంట్స్ సాధించిన సంద ర్భంగా గవర్నరుపేటలోని ఎం.బి. భవన్‌లో గురు వారం జరిగిన సక్సెస్ మీట్-2025 కార్యక్రమం లో పాల్గొన్న రామ్‌జీ కునా ఈ సందర్భంగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ, పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం కష్టంగా ఉందని, ఈ క్రమంలో వివిధ కార్పొరేట్ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచి ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ప్రపంచం లోనే ప్రఖ్యాత నలంద, తక్షశిల విశ్వవిద్యాల యాలకు మంచి గుర్తింపు ఉందని, అటువంటి సంస్థ పేరుతో నలంద డిగ్రీ కళాశాల కూడా మంచి ఫలితాలను సాధిస్తుందని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని అభినందించారు. ఎన్‌టీఆర్ జిల్లా యువజన సేవల విభాగం ముఖ్య కార్య నిర్వహణాధికాది యు.శ్రీనివాసరావు మాట్లాడు తూ, విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కళాశాలలో కొత్త కోర్సు లను ప్రారంభించి విద్యార్థులకు చక్కని విద్యను అంది స్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ, 2024- 25 విద్యా సంవత్సరంలో తమ కళాశాల విద్యార్థులు 374 మంది వివిధ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు పొందారని చెప్పారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుండి రూ.11 లక్షల వరకు వార్షిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ అవకాశాలు పొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పి.జి. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ ఖాసిం షా, అధ్యాపకులు పాల్గొన్నారు. తొలుత కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.




## జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో..

# విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం, పర్యావరణ పరిరక్షణలో నేటి విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించాలని అటవీ శాఖ, మెరైన్ అధికారులు కోరారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ జాతీయ సేవా పథకం యూనిట్ 1-2, ఎకో క్లబ్ జంతుశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవడంలో భాగంగా కోడూరు మం డల శివారు పాలకాయ తిప్ప తాబేళ్ళ సంరక్షణ కేంద్రానికి విద్యార్థులను తీసుకువెళ్లారు. ఈసందర్భంగా తాబేళ్ల సంరక్షణ అధికారులు నాగరాజు, మెరైన్ పోలీస్ అధికారులు రామకృష్ణ తదితరులు విద్యార్థులకు ఆలివ్ రిడ్లీ తాబేళ్ళ సంతాన ఉత్పత్తి విధానం సంరక్షణ పద్ధతులను వివరించారు. అంత రించిపోతున్న ఆలివ్ రిడ్లీ తాబేలు సంరక్షణ గురించి అవగాహన కలిగిం చారు. విద్యార్థులందరూ అక్కడే ఉన్న మ్యూజియాన్ని సందర్శించారు. వన్య ప్రాణి సంరక్షణ ఆవశ్యకత, మడ అడవుల ప్రాధాన్యత తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి, చరిత్ర అధ్యా పకులు డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ డాక్టర్ ఏ వీరకుమారి, యూనిట్ 2 పిఓ డాక్టర్ వై ఎన్సి సిహెచ్ రవిబాబు, రసాయన శాస్త్ర అధ్యాపకులు జి నాగార్జున, గణిత శాస్త్ర అధ్యాపకులు ముత్యాల వెంకటేశ్వరరావు, లైబ్రేరి యన్ విశ్వేశ్వరరావు, జంతు శాస్త్ర అధ్యాపకులు నాగమణి, జూనియర్ అసిస్టెంట్ ప్రభాత్ కిరణ్, రమేష్ విద్యార్థులు హాజరయ్యారు.

## అనాధలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి కుమా రుడు అనుదీప్ పుట్టినరోజు సందర్భంగా వంద మంది అనాధలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. గురువారం స్థానిక రాజీవ్ గాంధీ సెంటర్లో జనసేన పార్టీ నాయకులు గాజుల పోతురాజు ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు వితంతువుల సమక్షంలో కేక్ కట్ చేసి అనుదీప్ కు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు. వందమంది వృద్ధులు వికలాంగులు సాధువులు వితంతువు లకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి అన్నదాన నిర్వాహకులు చిట్టా ప్రసాద్ పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థినికి అభినందన, సహాయం



**చల్లపల్లి, మేజర్ న్యూస్** : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో 957 మార్కులు సాధించిన చల్లపల్లి గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని మునిపల్లి వినీతను బీసీ, దళిత, ప్రజాసంఘాల నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. చల్లపల్లిలో రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థిని వినీత, తల్లిదండ్రులు మునిపల్లి జయకృష్ణ – సీత దంపతులను అభినందించారు. పేద కుటుంబం కావటంతో విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి కొంతమేర సాయమందించారు. బీసీ సంఘ నేత అందె జగదీష్ విద్యార్థినిని సత్కరించి నగదు బహుమతి అందించగా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్బాబు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, విశ్రాంత ఫోర్మెన్ ఉప్పల సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ నేత మీర్ రిజ్వాన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్, రమాభాయి అంబేద్కర్ సేవాసంఘం నేతలు స్పందించి విద్యార్థిని అభినందించి తమవంతుగా ప్రోత్సాహక నగదును అందించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి బుజ్జి, మేరుగు రమేష్, మాతంగి నరసింహారావు పాల్గొన్నారు.

## శ్రీ చామర్తి ప్రకాశ్రాయ ఉన్నత పాఠశాల ప్లస్ వజ్రోత్సవ వార్షిక వేడుకలు



**కోడూరు మేజర్ న్యూస్** : కోడూరు మండలం స్వతంత్ర పురంలో 75 సం.లు నిండుకొని గతంలో జిల్లా పరిషత్ హై స్కూల్ గా ఇప్పుడు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ జూనియర్ కాలేజీ గా ఏర్పాటు చేయడమైనది వజ్రోత్సవ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి పాఠశాల హెచ్ఎం ప్రధానోపాధ్యాయులు ఆళ్ల వెంకటరమణ సారధ్యంలో ఈ వార్షికోత్సవం ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథుగా జిల్లా విద్యాశాఖ అధికారి, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కోడూరు మండల జడ్పిటిసిలు మండల అధికారులు పంచాయతీ అధికారులు పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ఉన్నటువంటి పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు విద్యార్థులు తమ నైపుణ్యతతో నాట్య రూపంలో అనేక కార్యక్రమాల్లో పాల్గొని అధికారుల యొక్క మెప్పును పొందుకున్నారు.

## అగ్నిప్రమాదంలో వరిగడ్డి వామి దగ్ధం



**చల్లపల్లి, మేజర్ న్యూస్** : చల్లపల్లి పడమర వీధిలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో గొరిపర్తి రాముకు చెందిన వరి గడ్డి వామి దగ్ధమైంది. సుమారు ఏడెమినిది ఎకరాలకు సంబంధించిన వరి గడ్డి దగ్ధం కాగా, లక్ష రూపాయల మేరకు నష్టం వాటిల్లింది. వరిగడ్డి వామి పెద్దది కావటంతో పూర్తిగా ఆర్పేందుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది వరి గడ్డి వామిని పూర్తిగా అర్పేందుకు కృషిచేస్తున్నారు. ప్రమాద కారణం తెలియరాలేదు.

## పోషణ్ పక్వాడా అవగాహన కార్యక్రమాలు



చల్లపల్లి, మేజర్ న్యూస్ : అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చల్లపల్లి మండల ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఆదిలక్ష్మి, విశ్రాంతమ్మల పర్యవేక్షణలో బుధవారం పలు అంగన్వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని రామానగరం, శివరామదుర్గాపురం, నూకలవారిపాలెం, మాజేరు తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, లీలావతి, ధనలక్ష్మి, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కామాక్షీదేవి, శివకుమారి, నాగరాజకుమారి, నాగజ్యోతి, ఉమామహేశ్వరి, బసవపూర్ణ, ఏఎన్ఎం సబిత తదితరులు పాల్గొన్నారు. గర్భవతి నిర్ధారణ నాటి నుంచీ ప్రసవించిన రెండేళ్ల వరకూ 1000 రోజుల సంరక్షణ గురించి వివరించారు. పోషకాహార ఆవశ్యకతను బాలింతలు, గర్భిణీలకు తెలియచేశారు.

# అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి




**అవనిగడ్డ, మేజర్ న్యూస్** : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులు అప్రమత్తతతో వ్యవహరించి సకాలంలో సమాచారం అందించాలని ఫైర్ స్టేషన్ అధికారి పిఎస్వివి ప్రసాద్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన గురువారం శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వేసవి తీవ్రతలో గృహ నివాసాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి విద్యార్థిని విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, ఇళ్లల్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు అందరిని ఆరు బయట సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. అపార్ట్మెంట్లు, పెద్ద పెద్ద భవనాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు లిఫ్ట్ మార్గం కాకుండా మెట్ల మార్గాన్ని వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకున్నప్పుడు నీటితో ఆర్పుకోకుండా వెంటనే కరెంటు మీటర్ ను ఆఫ్ చేయాలని. వ్యక్తిగత ఆపద లేకుండా అగ్నిని ఆర్పేందుకు ప్రయత్నం చేయాలన్నారు గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని ఆ సమయంలో ఎలక్ట్రికల్ స్విచ్ వను ఆన్ ఆఫ్ చేయకూడదు అన్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే ఫైర్ సిబ్బందికి తెలియజేసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రతి కళాశాలలోనూ విద్యార్థిని విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తూ ఉండాలని ఆయన విద్యాసంస్థలకు విజ్ఞప్తి చేశారు.

## నిరుద్యోగ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మండలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్** : నిరుద్యోగ యువత జాబ్ మేళా ద్వారా వచ్చిన ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఎదగాలని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాల అభివృద్ధి శిక్షణ శాఖ అద్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళా ద్వారా వచ్చిన ఉద్యోగంలో చేరి తమకు ఆసక్తి కలిగిన ఉద్యోగానికి తగిన నైపుణ్యం పెంచుకుని ఎదిగేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పది కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసి అభినందించారు. జాబ్ మేళాలో 113 మంది పాల్గొనగా అందులో 76 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరొక 14 మంది తదుపరి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి సహకారంతో జిల్లా ఉపాధి అధికారి, డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ జాబ్ మేళా నిర్వహించారు.గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ జాబ్ మేళాల కు విస్తృత ప్రచారం కల్పించి యువత పెద్దసంఖ్యలో వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది జి.పృద్విజ, ఆర్.ప్రశాంత్, ఎమ్.కావ్య, డి.రాహుల్, సిహెచ్ రాజేష్, కె.దిలీప్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జి. గోపి



**మచిలీపట్నం మేజర్ న్యూస్** : జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా గురువారం జిల్లా మచిలీపట్నం న్యాయస్థానంలో బాధ్యతలు స్వీకరించిన జి.గోపికి న్యాయమూర్తులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన



**చల్లపల్లి, మేజర్ న్యూస్** : ఆచార్య ఎన్.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం బుధవారం లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డ గ్రామంలో వేసవిలో మినుము పంటపై క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త డా.డి.సుధారాణి పలు సూచనలు చేశారు. మినుము పంటలో రసం పీల్చే పురుగు నిర్మూలనకు ఇమిడక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలని తెలిపారు. తెల్లదోమ ఉధృతి గమనించడానికి పసుపు జిగురు అట్టలు ఎకరాకు 8 ఏర్పాటుచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డా.ఎం. వెంకటలక్ష్మి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్** : పార్టీ కోసం నిబద్ధతతో పని చేసిన వారికి తెలుగుదేశం పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు.దివి మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా నియమితుడైన సీనియర్ తెలుగుదేశం నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావును అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కనపర్తి మాట్లాడుతూ కొల్లూరి వెంకటేశ్వరరావు గడచిన అయిదేళ్లలో వైసీపీ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేశారని, అదే సందర్భంలో పార్టీ ఆదేశించిన అన్ని కార్యక్రమాలను తన భుజస్కందాలపై వేసుకొని నిర్వహించారని, నాడు ఆయన చెందిన కృషే నేడు మార్కెట్ కమిటీ చైర్మన్ కావడానికి తోడ్పడిందన్నారు. నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల్లో నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు తరలివచ్చి కొల్లూరి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధి రావు, సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, తెలుగుదేశం నేతలు పైడిపాముల కృష్ణకుమారి, బండే కనకదుర్గ,మోర్ల జయలక్ష్మి, దీవి యుగంధరి, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్, లకనం నాగాంజనేయులు, నాయుడు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సమగ్రాభివృద్ధిలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర కీలకం

### చల్లపల్లి ఎంఈఓ వెంకటేశ్వరావు



**చల్లపల్లి మేజర్ న్యూస్** : విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తూ సమాజ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడుతున్నాయని చల్లపల్లి మండల విద్యాశాఖ అధికారి పరిశేవెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నిమ్మగడ్డ ప్రాథమిక పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాన్ని నైపుణ్యం జ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ వారి భవిష్యత్తును రూపొందించడంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.పాఠశాలల్లో వార్షికోత్సవాల నిర్వహించడం ద్వారా పాఠశాల జీవితము యొక్క ప్రాముఖ్యతను, పాఠశాల సాధించిన విజయాలను సమాజానికి తెలియ చేయవచ్చున్నారు. పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బి. చెన్నకేశవ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్ బాబు, విజయభాస్కర్, ఏ.గోపాలకృష్ణఎన్.సుగుణ కుమారి,ఎస్ఎంసి కమిటీ చైర్మన్ దాసరి శ్రీను, పాస్టర్ సంగీత రావు,పి. నాగలక్ష్మి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నత్త నడకన రహదారి పనులు

## వర్షాకాలం నాటికైనా పనులు పూర్తయ్యేనా.?


నిర్మాణంలో ఉన్న కల్వర్టు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక రహదారిపై నిర్మిస్తున్న కల్వర్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత 15 రోజులుగా కల్వర్టు నిర్మాణం కోసం రహదారిని తవ్వి తూములు సిద్ధం చేసుకున్నప్పటికీ పనులు కొనసాగక పోవడంతో గ్రామస్తులు ప్రమాదాలకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవనిగడ్డ నుండి దక్షిణ చిరువోలులంక వెళ్లే కృష్ణా కరకట్ట కింద భాగంలో వర్షాకాలంలో, వరదల సమయంలో వరద నీరు రాకుండా కలవర్టు నిర్మాణం కోసం రహదారి తవ్వి కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కల్వర్టు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇందుకోసం గ్రామస్తులకు ప్రత్యామ్నాయంగా వేరే మార్గం మట్టితో వేశారు. మట్టితో వేయడంతో రెండు రోజులుగా పడుతున్న చినుకులకు ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని మోదుమూడి సర్థా కోడు నుండి వలంద పాలెం, దక్షిణ చిరువోలులంక, అయ్యవారిపాలెం నుండి కొత్తపాలెం వరకు ఈ రహదారి పనులు చేసేందుకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసారు. ఇటీవల కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఏ రోడ్డును తవ్వి తూములను సిద్ధం చేసుకున్నప్పటికీ నిర్మాణం పనులు పూర్తి చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు ఆ ప్రాంతంలో ఎలాంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడం వలన వాహనదారులు కరకట్ట పై నుండి దిగుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు పనులు మరో 10 రోజుల పాటు జరగనుందన త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెప్తున్నప్పటికీ ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న బాల్య స్నేహితునికి ఆర్థిక సాయం

**పెడన, మేజర్ న్యూస్:** పెనుమల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో 1992-93 సంవత్సరం కలిసి చదువుకున్న తమలో ఒక స్నేహితునికి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆర్థికపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని తెలుసుకొని తమతో కలిసి చదువుకున్న చిన్ననాటి బాల్య స్నేహితునికి ఆర్థిక సహాయం క్రింద లక్ష రూపాయలు అందించామని ఆ సంవత్సరం పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ మేరకు బాల్య స్నేహితునికి చోడవరం గ్రామంలో తన ఇంటి వద్దకు వెళ్లి నగదు అందించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ 1992-93 సంవత్సరంలో పెడన మండలం పెనుమల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో కలసి చదువుకున్న విద్యార్థులలో చోడవరం గ్రామానికి చెందిన దాసి తాతారావుకు బ్రెయిన్ స్ట్రోక్ వల్ల అనారోగ్య సమస్యలు రావడంతో ఫలితంగా ఆర్థికపరమైన ఇబ్బందుల్లో ఉన్నాడని తమ స్నేహితుల ద్వారా తెలుసుకొని కష్టాల్లో ఉన్న తమ మిత్రుడిని ఆదుకునేందుకు అంతా కలిసి మంచి ఆలోచనతో లక్ష రూపాయలు స్నేహితుల నుంచి సేకరించామన్నారు. ఇందులో 75 వేలు తాతారావు కూతురి పేరున బ్యాంకులో డిపాజిట్ చేసి మిగిలిన 25 వేల రూపాయల అతని చేతికి వైద్య ఖర్చుల నిమిత్తం అతనికి అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో



శీరం ప్రసాద్, కాగిత నాగేశ్వరావు, మట్టా శాంతి, కే.ఈ కృష్ణవేణి, సుంకర రాజ్యలక్ష్మి, వూసా వాసు, పాశం నాగ శ్రీనివాసరావు, బొల్లా సుజాత, ఉప్పాల కృష్ణప్రసాద్, మాన్యం హరినారాయణ, రవికుమార్ నాగలక్ష్మి(అమ్మమ్మలు) పోలగాని రాము, పామర్తి రాము, జన్ను రాధరాణి, సుచరిత శ్రీదేవి, తదితరులు స్నేహితుడిని ఆదుకున్న వారిలో ఉన్నారు.

# ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయం

## గన్నవరం నియోజకవర్గ టీడీపీ నాయకులు



**గన్నవరం, ఏప్రిల్ 17, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమీ ప్రభుత్వాన్ని అభినందిస్తూ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గండేపూడి నితీష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రధాని మంత్రి నరేంద్ర మోడి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్గీకరణ విషయంలో మాదిగలకు అందించిన మద్ధతును మాదిగలు ఎన్నటికీ మర్చిపోరని తెలిపారు. అదే విధంగా దశాబ్దాల కాలం మాదిగల తీరని కోరికగా ఉన్న వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూన్న తీర్మానంకి సహకరించి కృష్ణ మాదిగ పోరాటాలను అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు తెలియజేసి మాదిగల వెనుకబాటుకు గురయ్యారని వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ అని తెలియజేసి వర్గీకరణకు సహకరించిన ప్రధాని మోదీ, ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా ఉంగుటూరు గ్రామ కాటూరి వరప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం అమలుకు మాతో పాటు కలిసి సహాయం చేసిన అన్నివర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ ఏ కులానికి వ్యతిరేకం కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన అమరుల జాతి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తుంది అని తెలిపారు. ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయం త్వరలో విడుదల చేయనున్న డిఎస్సి నోటిఫికేషన్ తోనే విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలాగా కూటమి ప్రభుత్వం చర్యలను తీసుకోవడం హర్షణీయంగా భావిస్తున్నాం.

అదేవిధంగా బొమ్మలూరు గ్రామ సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ ఉపకలాల్లో సమన్యాయం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వర్గీకరణ చేసిన ఘనత కూటమి ప్రభుత్వాన్నిదని అన్నారు. కూటమి ప్రభుత్వం 2026 జనగణన తర్వాత వర్గీకరణను జిల్లాని వారుగా అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం తెలపడం హర్షినియంగా భావిస్తున్నాం. 30 ఏం ఆర్ పి ఎస్ ఏళ్ల పోరాటాన్ని గుర్తించి ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ కి మా జాతి యావత్ మీకు రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోకినాల సాంబశివ రావు, నిమ్మకూరు మహేష్, తిరివిది నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# చందు వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన ఏపీఐఐసీ డెరెక్టర్ మండలి రాజేష్

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** అధిక పని భారం.. ఒత్తిడి మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీంతో పాటు ఒకే చోట కూర్చుని పని చేయడం వంటి కారణాలు అధిక బరువుకు కారణం అవుతున్నాయి. అధిక బరువు, స్థూలఖాయం లాంటి సమస్యలకు చందు వెల్ నెస్ సెంటర్ అద్భుత పరిష్కార మార్గాలు చూపుతోందని, ఎంతో మంది ఇక్కడ లభించే సహజ సిద్దమైన న్యూ ట్రీషియన్ ఫుడ్‌తో పాటు కోచ్ పుష్ప నారయ్య పర్యవేక్షణలో మంచి ఫలితాలు వస్తున్నాయని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ తెలిపారు. థైరాయిడ్ వంటి ధీర్ఘ కాలిక సమస్యలకు కూడా ఇక్కడ పరిష్కారం లభించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. వర్రే శశికళ లాంటి గృహిణులు ఇలాంటి సామాజిక పరివర్తన కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. గురువారం యనమలకుదురు, సాయినగర్‌లోని శ్రీనివాస టవర్స్‌లో చందు వెల్‌నెస్ సెంటర్‌ని సందర్శించారు. వరల్డ్ నంబర్ వన్ న్యూట్రీషి యన్ కంపెనీ పర్యవేక్షణలో సాగుతున్న వెల్ నెస్ ట్రీట్ మెంట్‌ని పరిశీలించి కోచ్, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా చందు వెల్ నెస్ సెంటర్ నిర్వాహకులు మండలి రాజేష్‌ని సత్కరించారు.

# రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఎంజి రోడ్, సుర్యరావుపేట, నక్కల రోడ్డు, డోర్నకల్ రోడ్డు, ఏలూరు రోడ్డు, రామవరప్పాడు రింగ్ నేషనల్ హైవే, కనకదుర్గ వారధి ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలని, నగరాన్ని వ్యర్థ రహిత నగరంగా మార్చేందుకు పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, డివైడర్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, రోడ్లు అన్నియును పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు వ్యర్ధాలను తొలగిస్తుండాలని ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్‌ను ఆదేశించారు. డివైడర్లలో హరితాన్ని మరింత పెంచాలని, నగరంలో కాలుష్యం తగ్గించే విధంగా మొక్కలను మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌ని ఆదేశించారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999